AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

భక్తుల కొంగు బంగారం..
శంభుని ఆలయం



2



2

దొంగల ముఠా అరెస్ట్

## ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏడీఏ సుధా మాధురి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా స్టాక్‌ను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతి ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులు ఈ-పాస్ మిషన్ ద్వారానే విక్రయాలు జరపాలని సూచించారు. అన్ని పురుగుల మందులపై తప్పనిసరిగా ఎక్స్‌పెయిరీ డేట్‌ను ఉండాలని ఆదేశించారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయ అధికారి, సిబ్బంది ఉన్నారు.






## శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత..

**అక్షరటుడే, బాల్కొండ :** శ్రీరాంసాగర్‌కు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అధికారులు వరద గేట్ల ద్వారా నీటి విడుదలను ఆపేశారు. బుధవారం 26 గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేసిన అధికారులు గురువారం అన్ని గేట్లను మూసివేశారు. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 1.20 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1089.40(74.72టీఎంసీలు) అడుగుల నీరు ఉంది.



## నిజాంసాగర్ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

**అక్షరటుడే, నిజాంసాగర్ :** నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ భాగం నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో భారీగా వస్తుండడంతో మూడురోజులుగా నీటిని మంజీరలోకి వదులుతున్నారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం నాటికి ప్రాజెక్టులోకి 52,477 ఇన్‌ఫ్లో వస్తుండడంతో 9 వరద గేట్ల ద్వారా 37,290 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నట్లు ఈఈ సోలోమన్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1405.00 అడుగులకు (17.80 టీఎంసీలు) గాను 1402.20 అడుగుల (13.94 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.



## పెయిడ్ పార్కింగ్ ఏరియాగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియం: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఖలీల్‌వాడిలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరిస్తున్నామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలో అన్ని శాఖల సమన్వయంతో సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఖలీల్‌వాడిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించే విధంగా ప్రణాళికలు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా రాంగ్ పార్కింగ్, సెల్లార్ పార్కింగ్ తదితర విషయాలపై చర్చించారు. భవిష్యత్తులో రాజీవ్ గాంధీ ఆడిటోరియం పెయిడ్ పార్కింగ్ ఏరియాగా ఏర్పాటు చేస్తామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, అదనపు మున్సిపల్ కమిషనర్ రవి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్, నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఏసీబీ నజర్ పెట్టింది. ఇందులో భాగంగా గతంలో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. మూడు రోజుల క్రితం ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ కార్యాలయానికి పిలిపించినట్లు తెలిసింది. – అక్షరటుడే, ఇందూరు




# విద్యాశాఖపై ఏసీబీ నజర్..

▸ ఇద్దరు ఉద్యోగులపై విచారణ..! ▸ శాఖలో చర్చనీయాంశమైన వైనం..


జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏదో ఒక ఘటన వెలుగు చూస్తూనే ఉంది. ఆది నుంచి అవినీతిపై పలు ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉంది. అయితే దీనిపై ఏసీబీ అధికారులు నజర్ పెట్టారు. గతంలోనూ పలుమార్లు ఆయా అంశాల్లో అవినీతి జరిగిందని తెలుసుకొని ఏసీబీ ఉన్నతాధికారులు పలువురిని విచారించారు. అయితే ఇటీవల మూడు రోజుల క్రితం కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్, అలాగే సర్వశిక్ష అభియాన్‌లో గతంలో విధులు నిర్వహించిన ఓ ఉద్యోగిపై విచారణ చేపట్టినట్లు సమాచారం. అయితే వీరిరువురు గత డీఈవో హయాంలో చేసిన అవినీతిని దృష్టిలో పెట్టుకొని ఏసీబీ అధికారులు విచారించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విషయం డీఈవో కార్యాలయంలో చర్చనీయాంశమైంది.

### చేతులు తడపాల్సిందే..

ఏసీబీ అధికారులు గతంలోనూ పలుమార్లు డీఈవో కార్యాలయంలోని ఉద్యోగులపై విచారణ చేపట్టారు. అయినా అధికారుల తీరు మాత్రం మారడం లేదు. ఇటీవల ప్రైవేటు పాఠశాల రెన్యువల్ కోసం డబ్బులు డిమాండ్ చేయడం, చివరికి కార్యాలయంలోని సిబ్బంది పదవీ విరమణ చేస్తే వారి బిల్లులను పాస్ చేయడానికి సైతం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. కార్యాలయంలో అధికారుల చేతులు తడిపితేనే పనులు చేస్తారనే విమర్శలు ఉన్నాయి.

కార్యాలయంలోని ఓ జూనియర్ అసిస్టెంట్ తనకు ఆదాయం ఉండే సెక్షన్ ఇవ్వాలని బాహాటంగానే ఉన్నతాధికారులతో చెప్పడం విస్మయానికి గురి చేసింది. అంటే అవినీతి ఎంతగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత డీఈవో ఇలాంటి వాటికి దూరంగా ఉంటున్నప్పటికీ కిందిస్థాయి ఉద్యోగులు మాత్రం యథేచ్ఛగా తమ పని కానిస్తున్నారు. అవినీతి అధికారులపై డీఈవో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే ఏసీబీ అధికారుల విచారణతో విద్యాశాఖలో అవినీతి అంశం మరోసారి చర్చనీయాంశమైంది.

## ఏసీబీకి పట్టుబడిన ఆర్మూర్ ఎంవీఐ..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) గుర్రం వివేకానంద రెడ్డి ఏసీబీకి పట్టుబడ్డాడు. ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. ఓ వాహనానికి చెందిన రిజిస్ట్రేషన్, లైసెన్స్ రెన్యూవల్ లెర్నింగ్ లైసెన్స్‌లకు సంబంధించి ఓ వ్యక్తి నుంచి ఎంవీఐ వివేకానంద రెడ్డితో పాటు ఆయన డ్రైవర్ తిరుపతి రూ.25 వేలు డిమాండ్ చేశారు. దీంతో అతడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు వలపన్నారు. సదరు వ్యక్తి నుంచి ఎంవీఐతో పాటు అతని డ్రైవర్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారిద్దరిని అదుపులోకి తీసుకుని నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు. అనిశాకు ఆర్మూర్ ఎంవీఐ పట్టుబడడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

### ఇటీవల ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో తనిఖీలు

ఏసీబీ అధికారులు ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లోనూ తనిఖీలు నిర్వహించారు. సుమారు నెల రోజుల క్రితం కామారెడ్డి జిల్లా పొందుర్తి చెక్‌పోస్టులో సోదాలు చేశారు. అలాగే గత జూన్ నెలలో సలాబత్‌పూర్ రవాణా శాఖ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు.



## గోల్ హనుమాన్ ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని గోల్ హనుమాన్ ఆలయ నూతన పాలకవర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా ఎన్నుకున్న పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. గోల్ హనుమాన్ ఆలయ నూతన పాలక మండలి ఛైర్మన్ బండారి నరేందర్, ఆలయ ధర్మకర్త తొడుపునూరి రామ్, మోహన్, గుండా సుధీర్, కరిపె లింగం, క్యాసారం విజయ్, ఉప్పరి స్వప్న, గంట జ్యోతి ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆలయ అర్చకులు జయరాజ్ జోషి, జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, గింజుపల్లి వేణు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, శంభులింగేశ్వర ఆలయ కమిటీ ఛైర్మన్ బింగి మధు, విజయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు రుణాలు అందించామని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా గృహ నిర్మాణం కోసం లబ్ధిదారులకు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జిల్లా గ్రామాభివృద్ధి సంస్థ, మెప్మా నుంచి రుణాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 4,348 మంది లబ్ధిదారులకు రూ. 50.95 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 3,916 మందికి రూ.46.59 కోట్లు, మెప్మా ద్వారా 432 మందికి రూ. 4.36 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం మంజూరు చేశామని తెలిపారు.

## రాచూర్ గ్రామంలో మెడికల్ క్యాంప్



**అక్షరటుడే, నిజాంసాగర్:** మద్నూర్ మండలం రాచూర్ గ్రామంలో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గ్రామాన్ని సందర్శించారు. అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వైద్యాధికారులకు ఫోన్ చేశారు. వైద్యుల బృందాన్ని పిలిపించి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యుల సూచన మేరకు కొంతమంది రోగులను మద్నూర్ మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు సిబ్బంది నాయకులు తదితరులు ఉన్నారు.

## ఐటీఐలో ప్రవేశాల పెంపునకు కృషి చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలు పెంచేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఐటీఐ ట్రేడ్స్‌తో పాటు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 28 లోపు అర్హులైన వారు స్పాట్ అడ్మిషన్లు పొందేలా ప్రోత్సహించాలని సూచించారు.

## డ్రెయినేజీలు బ్లాక్ కాకుండా చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, కామారెడ్డి :** మున్సిపాలిటీలో ఎక్కడ కూడా డ్రెయినేజీలు బ్లాక్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో చేపడుతున్న పారిశుధ్య పనులను గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల ప్రభావంతో నీరు నిల్వ ఉండి అధికంగా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున జిల్లావ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వర్షాలు కురిసిన అనంతరం వాన నీరు నిలిచి ఆ నీటిలో దోమలు గుడ్లుపెట్టి దోమలు అధికంగా వృద్ధి చెందుతాయని కలెక్టర్ వివరించారు. జిల్లావ్యాప్తంగా గ్రామాలు పట్టణాల్లో అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, డ్రెయినేజీలు శుభ్రం చేయాలని, డ్రైడే రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. మరొకసారి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పట్టణంలో డ్రెయినేజీలు బ్లాక్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలో మియావకి పద్ధతిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని సూచించారు.

## మెళకువలతో ఉత్తమ బోధన

**అక్షరటుడే, ఇందూరు:** సంపూర్ణమైన మెలకువలతో ఉత్తమ బోధన చేసే అవకాశం ఉంటుందని డీఈవో అశోక్ అన్నారు. విద్యాశాఖ నిజామాబాద్ ఉత్తర మండల ఆధ్వర్యంలో గురువారం దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ) మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పలు అంశాలపై పట్టు పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా టీచింగ్ స్కిల్స్ పెరగడం వల్ల విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో బాలకృష్ణ, ఎంఈవోఆర్ వీఎన్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీకి బ్రేక్..!




**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా.. ఆయన బదిలీకి సంబంధించి బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న దిలీప్‌కుమార్‌ను ఏడాది కాకుండానే బదిలీ చేయడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. కాగా.. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో ప్రాతినిథ్యం వహిస్తున్న పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులైన షబ్బీర్‌అలీ మున్సిపల్ కమిషనర్ బదిలీ అంశంపై సీరియస్ అయినట్లు సమాచారం. కనీస సమాచారం లేకుండా జిల్లాలో ముఖ్యమైన అధికారిని ఎలా బదిలీ చేస్తారని వారు సీఎంవోను ప్రశ్నించినట్లు తెలిసింది. కమిషనర్ బదిలీపై ప్రజాప్రతినిధులు సీఎంవోపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన బదిలీ నిలిచిపోయినట్లు సమాచారం. కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు నిజామాబాద్‌కు బయలుదేరిన యాదగిరిరావుకు ఉన్నతాధికారులు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఆయన మార్గమధ్యం నుంచే తిరిగి వెళ్లిపోయినట్లు సమాచారం.

## రూ.10కే డ్రెస్ అని ప్రచారం.. ఎగబడిన జనం..




**అక్షరటుడే, ఆర్మూర్ :** కొందరు దుకాణాల నిర్వాహకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి సోషల్ మీడియాలో డిస్కౌంట్ల పేరిట ప్రచారాలు చేస్తున్నారు. మరికొందరు ఫేమస్ కావాలని రూ.5కు షర్టు, రూ.10కి డ్రెస్ అందిస్తామని ప్రచారం చేస్తున్నారు. దీంతో ప్రజలు దుకాణాలకు పరుగులు పడుతున్నారు. తాజాగా ఆర్మూర్‌లో ఓ వ్యక్తి రూ.10కే డ్రెస్ అందిస్తామని ఆఫర్ పెట్టాడు. పట్టణంలోని ఆర్కే కాంప్లెక్స్ వెనక గల ఫంకీ బాయ్స్ డ్రెస్సెస్‌లో ఈ ప్రత్యేక ఆఫర్ ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి యువకులు భారీగా దుకాణానికి చేరుకున్నారు. ఈ క్రమంలో షాపు ఎదుట భారీగా ప్రజలు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. షాపు ఎదుట భారీగా జనం ఉండడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో లైన్‌లో ఉన్న వారిని చెదరగొట్టారు. షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిక

**అక్షరటుడే, కామారెడ్డి:** బహుజన వాదం పేరుతో బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాటలు నమ్మి మోసపోయామని భిక్కనూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో గురువారం సుమారు 40 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో చేరి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారు. నేడు బడుగు బలహీన వర్గాల తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు షబ్బీర్ అలీ అభినందనలు తెలిపారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**అక్షరటుడే, కామారెడ్డి :** మాయమాటలు చెప్పి చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 26న భిక్కనూరులోని దత్తాత్రి వెదురుబొంగుల షాప్‌లో ఉన్న ఊరే లక్ష్మి వద్దకు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి షాప్ పేరుపై నీకు లోన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు పలు ఆధారాలు సేకరించారు. గురువారం టోల్‌గేట్ వద్ద ఒకరిని, కామారెడ్డిలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. చోరీ చేసిన విషయాన్ని ఒప్పుకున్నారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ముథ్కేడ్‌కు చెందిన ఆఫ్తాబ్ అహ్మద్ షేక్, ఉమ్రికి చెందిన ఫహీమాబేగం, నాగపూర్ సిటీకి చెందిన కబీరుద్దీన్, అబ్దుల్ రహ్మాన్ షేక్, నాగపూర్‌కు చెందిన దీపక్ కిసాన్ సాలుంకేలను పోలీసులు అరెస్ట్ చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి సబ్‌డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





**భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా శంభుని గుడి విలసిల్లుతోంది. మహిమగల దేవుడని భక్తులు నమ్మకంతో భక్తి శ్రద్ధలతో కొలుస్తుంటారు. ఇక్కడ శివలింగాన్ని కొలిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు సమీపంలో స్వయంభుగా లింగం వెలిసింది. అప్పటినుంచి భక్తులు ఇక్కడి శివలింగాన్ని భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు.**

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

# భక్తుల కొంగు బంగారం..

# శంభుని ఆలయం

- స్వయంభుగా వెలిసిన లింగం
- శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు

శంభు లింగేశ్వరాలయంలో స్వయంభుగా వెలిసిందని పురాణాలు చెబుతున్నాయి. శాతవాహనులు, జైనులు, కాకతీయులు వారి పాలన కాలంలో గర్భాలయం, ముఖద్వారం, మండపం, ఇతర నిర్మాణాలు చేసినట్లు పూర్వీకుల మాట. ఈ ఆలయంలో స్వామివారిని భక్తులు శంభు లింగేశ్వర స్వామిగా కొలుస్తారు. అలాగే ఆలయానికి శంభుని గుడి అనే పేరు వాడుకలో ఉంది. ప్రస్తుతం ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉంది. నిత్యం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.

### శంభుని గుడి ప్రత్యేకతలు..

స్వయంభు శంభుని గుడికి అనేక ప్రత్యేకతలున్నాయి. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజున ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తారు. అలాగే ప్రతినెల మాస శివరాత్రిన సాయంత్రం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ ఉంటారు. కార్తీక మాసంలో, కార్తీక పౌర్ణమిన ఆలయంలో ఆకాశ దీపారాధన, జ్వాల తోరణం గోపురం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

### మహా శివరాత్రికి వేల సంఖ్యలో భక్తులు వస్తారు..



ఏటా మహాశివరాత్రి రోజు జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి రోజు శివపార్వతుల కల్యాణం, హోమం నిర్వహిస్తారు. ప్రతి సోమవారం అన్న ప్రసాదం నిర్వహిస్తాం. ప్రతి సోమవారం సాయంత్రం పల్లకీసేవతోపాటు భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

- రాజ్ కిరణ్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడుప

## జిల్లావాసికి డాక్టరేట్..



**అక్షరటుడే, లింగంపేట:** ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేటకు చెందిన నాగలక్ష్మి ఉస్మానియా వర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వర్సిటీ స్నాతకోత్సవంలో వీసీ మొగులారం కుమార్, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సమక్షంలో ప్రత్యేక అతిథి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణ్ చేతుల మీదుగా పట్టా తీసకున్నారు. వుద్దెమారి అనుసూజ, రాంచందర్ కుమార్తె అయిన నాగలక్ష్మి హిస్టరీ విభాగంలో "స్త్రీ సాధికారతపై బౌద్ధ దృక్పథం ప్రత్యేకించి తొలి బౌద్ధ మతాన్ని ప్రస్తావిస్తూ" అనే చరిత్ర అంశంపై చేసిన పరిశోధనకు గాను వర్సిటీ డాక్టరేట్‌తో సత్కరించింది. నాగలక్ష్మి ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్ నగర్ వారసత్వ శాఖ కార్యాలయంలో సహాయ సంచాలకురాలిగా పని చేస్తున్నారు. ప్రాచీన బౌద్ధ కాలంలో మహిళల స్థితి, బౌద్ధ విస్తరణలో మహిళల పాత్ర, స్వేచ్ఛ, సమాన హక్కుల్లో ఆ కాలంలో మహిళల సాధికారత.. అనే అంశాలపై పరిశోధన చేశారు.



## అకాల వర్షా నికి దెబ్బతిన్న వరి

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని మాగి గ్రామ శివారులో నల్లవాగు ముత్తడి నీటి ప్రవాహం వల్ల సుమారు 20 ఎకరాల పంట నీట మునిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నల్ల వాగు నీటి ప్రవాహం అధికంగా రావడంతో పంట పొలాల్లోకి వరద నీరు వచ్చిందని రైతుతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తుండగా పంట పూర్తిగా నీట మునిగింది. దీంతో దిక్కుతోచని స్థితి ఉన్న రైతు కన్నీటిపర్యంతమవుతున్నాడు. అధికారులు నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

## 23 నుంచి సత్యసాయి గ్రామోత్సవ కార్యక్రమాలు


**అక్షరటుడే, ఇందూరు:** సత్యసాయి బాబా శత వార్షిక జయంతిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 306 గ్రామాల్లో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం సత్యసాయి సేవాసంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈనెల 23, 24వ తేదీల్లో నిజామాబాద్ సమితిలోని మల్కాపూర్, జానకంపేటలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లి, అంకాపూర్, దోన్కల్ సమితిలోని వెంకటాపూర్, వేల్పూర్, మోర్తాడ్ సమితిలోని దొంపాల్, రామన్నపేట ఉత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే బోధన్ సమితిలోని వర్ని, అంబం, ధర్పల్లిలోని సీతయ్యపేట్, హొన్నాజీపేట్, చౌటుపల్లి రేకులపల్లిలో గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



## నష్టపరిహారం వెంటనే అందించాలి

**అక్షరటుడే,కోటగిరి:** భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని పోతంగల్ మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం డిప్యూటీ తహశీల్దార్ అజీజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్) మాట్లాడుతూ.. వారంరోజులుగా కురిసిన వర్షానికి, వరి, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయన్నారు. వాటిని పరిశీలించి పంటలకు పంట నష్ట పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వెంకా గౌడ్, ఓమన్నా పటేల్, మక్కయ్య, శ్రీను, సాయిలు, రాములు, విజయ్ కుమార్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరీ ఉత్సవాలను జయప్రదం చేయండి



**అక్షరటుడే, భిక్కనూరు:** భిక్కనూరులోని వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య సంఘ సభ్యులు కోరారు. గంగవరం ఆంజనేయ శర్మ, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్ర సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉత్సవాలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే మహిళలు సామూహిక కుంకుమార్చన, మంగళ నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

**మరొకరి పరిస్థితి విషమం..**

**అక్షరటుడే, బాన్సువాడ:** ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బాన్సువాడ మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంప్ శివారులో ఆర్టీసీ బస్సు టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బాన్సువాడ మండలం సోమ్లునాయక్ తండాకు చెందిన రమావత్ గోవింద్ మృతి చెందారు. రమావత్ రాములు పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి సైతం గాయాలయ్యాయి.

బోర్లం క్యాంపు శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండడంతో వేరే మార్గం ద్వారా ద్విచక్ర వాహనదారులు వెళ్లే ప్రయత్నంలో కామారెడ్డికి వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. అనంతరం గ్రామస్థులు గోవింద్ మృతదేహంతో పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

## మొక్కలను సంరక్షించాలి



**అక్షరటుడే, భీమ్‌గల్ :** వనమహోత్సవం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి నాటిన మొక్కలను గురువారం పరిశీలించారు. పట్టణంలోని రెండో వార్డు, కుప్కల్ రోడ్డులో, వేల్పూర్ రోడ్డు, బడా భీమ్‌గల్, బెజ్జోర బైపాస్ రోడ్డు తదితర ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటడంతో పాటు కంచెలు ఏర్పాటు చేశామన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ నరేందర్, వార్డ్ ఆఫీసర్లు నవీన్ తదితరులున్నారు.

## వంటమనిషి కోసం దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ కేజీబీవీలో వంటమనిషి కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి అనురాధ తెలిపారు. ఏడో తరగతి చదివి ఉండి, వసతి గృహాల్లో వంట చేసిన అనుభవం ఉన్న స్త్రీలు అర్హులని ఆమె పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ ఆధార్ కార్డుతో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతపర్చాలని.. జీతం రూ. 9,700 ఉంటుందన్నారు. భీమ్‌గల్ కస్తూర్బా పాఠశాలలో ఈనెల 22 నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

## మహిళ హత్య కేసులో ఒకరి అరెస్ట్




**అక్షరటుడే, కామారెడ్డి :** మహిళను చీర కొంగుతో ఉరివేసి హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. లింగంపేట మండలం ముట్టడికింది పల్లెకు చెందిన ఎరుగుదిండ్ల చిన్నక్క పింఛన్ తీసుకునేందుకు ఈనెల 4న సాయంత్రం లింగంపేటకు వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో చిన్నక్క తమ్ముడు మారుతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతురాలు ఫోన్ నంబర్ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానంతో లింగంపేట మండలం పర్మల్ల తండాకు చెందిన బాదావత్ ప్రకాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. లింగంపేట కల్లు కాంపౌండ్ వద్ద చిన్నక్కతో చనువుగా ఉండి డబ్బులు ఆశ చూపి రామాయంపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లగా అక్కడ ఇద్దరికి గొడవ జరిగింది. ఈ గొడవలో నిందితుడు చిన్నక్కను కొట్టి చీర కొంగుతో ఉరివేసి హత్య చేసి ఫోన్ తీసుకుని పారిపోయాడు. నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చదువుపై ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** చదువుపై అనాసక్తితో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నగరంలోని నాల్గో టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని రోటరీనగర్‌లో నివాసముండే శ్రీనివాస్‌కు ఒక కూతురు, ఒక కొడుకు రాజేశ్వర్ ఉన్నారు. రాజేశ్వర్ ప్రస్తుతం పదో తరగతి ఫెయిల్ అయినప్పటికీ సప్లిమెంటరీ పరీక్షలు రాసి తిరిగి పాసయ్యాడు. అనంతరం ఇంటర్‌లో జాయిన్ కావాలని తల్లిదండ్రులు చెప్పినప్పటికీ రాజేశ్వర్ వినలేదు. చదువుకుంటే ఉన్నతస్థానానికి వెళ్లవచ్చని.. సమాజంలో మంచిపేరు వస్తుందని తల్లిదండ్రులు రాజేశ్వర్‌కు నిత్యం చెబుతుండేవారు. కానీ రాజేశ్వర్‌కు మాత్రం చదువుపై ఏమాత్రం ఆసక్తి లేకుండాపోయింది. చివరికి చదువుపై అనాసక్తితో గురువారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న నాల్గో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడు దుర్మరణం

**అక్షరటుడే, బాల్కొండ:** బైక్ చెట్టును ఢీకొని యువకుడు మృతి చెందా డు. ఈ ఘటన మెండోరా మండలంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోచంపాడ్ గ్రామానికి చెందిన అఖిల్ (26) తెల్లవారుజామున స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో సోషల్ వెల్ఫేర్ వసతి గృహం సమీపంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు.